క్లుప్తంగా

ఓటర్ల జాబితా ప్రదర్శన

వేలేరు : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితాను వార్డుల వారీగా ఆయా పంచాయతీ కార్యాలయ నోటీస్ బోర్డులపై ప్రచురించినట్లు ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆస్తిలో వాటా అడిగితే అక్రమంగా కేసులు పెట్టించాడు

వేలేరు : తల్లితండ్రులు సంపాదించిన ఆస్తిలో వాటా ఇవ్వకపోవడమే కాకుండా తప్పుడు పత్రాలతో పట్టా చేసుకున్న సోదరుడిని తమ వాటా తమకు కావాలని అడిగినందుకు పోలీసుల సహాయంతో అక్రమ కేసులను బనాయించాడని మల్లికుదుర్ల గ్రామానికి చెందిన చాంద్‌పాషా, రజీయా వాపోయారు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిని తమ అన్నయ్య సర్వర్ ఒక్కడే సాదాబైనామాలో తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించి పట్టా చేసుకున్నాడని ఆరోపించారు. తమకు రావాల్సిన భూమి ఇవ్వాలని అడిగినందుకు చంపుతానని బెదిరిస్తున్నాడని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

యువకుడిపై కేసు నమోదు

ఆత్మకూరు : అక్కంపేటలో ఓ వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. అక్కంపేటకు చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన యువకుడు కడుదుల చిరంజీవి వివాహిత ఇంట్లో ఉండగా ఆమెను లాంగేదుకు ప్రయత్నించగా విడిపించుకుంది. చిరంజీవి నిత్యం వేధించడమే కాకుండా కోరిక తీర్చమని వేధిస్తున్నాడని ఫిద్యాదులో పేర్కొంది. చిరంజీవితోపాటు యువకుడి అక్క రమ, తల్లిదండ్రులు సంపత్, ఆగమ్మ కలిసి తనపై, భర్తపై చేయిచేసుకున్నారని తెలిపింది. వారితో ప్రాణహాని ఉందని, తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ ఈ సందర్భంగా తెలిపారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

ఐనవోలు : విద్యుదాఘాతంతో కాడెద్దు మృతిచెందింది. ఈ సంఘటన ఒంటిమామిడిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధిత రైతు గోనె రాజు తెలిపిన వివరాల ప్రకారం.. చెలుకలో అరుక తోలుతున్న క్రమంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లగా విద్యుదాఘాతానికి గురై కాడెద్దు మృతిచెందినట్లు తెలిపాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కువ ఎత్తులో నిర్మించాలని కోరినా విద్యుత్ అధికారులు పట్టించుకోలేదని వాపోయాడు. సుమారు రూ.80వేల విలువచేసే ఎద్దు మృతిచెందడంతో రైతు కన్నీరు పెట్టుకున్నాడు.

జిల్లా అధ్యక్షుడిగా కృష్ణప్రసాద్



కమలాపూర్ : అఖిల భారత పద్మశాలి సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని మర్రిపల్లిగూడెనికి చెందిన పొరండ్ల కృష్ణప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పెగడపల్లికి చెందిన కందికట్ల ప్రశాంత్ నియామకం అయినట్లు అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం శనివారం ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఇరువురికి నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారు తెలిపారు. నియామకానికి సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్నాల నరేందర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేదాసి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి తవుటం రవీందర్, మండల అధ్యక్షుడు బొప్ప శివశంకర్, నాయకులు పొరండ్ల రమేశ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

శాయంపేట : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి అన్నారు. నేరేడుపల్లి, అప్పయ్యపల్లి, కాట్రపల్లి గ్రామాలకు శనివారం సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. నాయకులు ప్రసాద్, సంజీవరావు, విష్ణువర్ధన్‌రెడ్డి, విజయ్, శివ, శ్యాంసుందర్‌రెడ్డి, మోహన్, కరణ్‌బాబు, అశోక్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

శాయంపేట : మైలారం గ్రామానికి చెందిన దూదిపాల ఆదిరెడ్డి, సిరిపురం అనసూర్య, అనారోగ్యంతో ఇటీవల మృతిచెందారు. శనివారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, నాయకులు ప్రసాద్, రాజిరెడ్డి ఉన్నారు.

విరాళాలు అందించాలి

ఆత్మకూరు : మండల కేంద్రంలో శివాలయ ప్రతిష్ఠాపన ఉత్సవాన్ని నిర్వహించేందుకు భక్తులు విరాళాలు అందించాలని కమిటీ అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. నవంబర్ 6, 7, 8వ తేదీల్లో పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. రూ.3 కోట్ల భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం పూర్తి అయ్యిందని, అలాగే ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించుకునేందుకు భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

నిలిచిన నిధులు.. ఆగిన పనులు

- పూర్తికాని వంతెన నిర్మాణ పనులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికుల విజ్ఞప్తి



అసంపూర్తిగా ఉన్న ఎల్లమ్మవాగు వంతెన నిర్మాణం

వేలేరు : మండల కేంద్రం నుంచి కొత్తకొండ గ్రామానికి వెళ్లే దారిలో గల ఎల్లమ్మ వాగుపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వంతెన నిర్మాణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఆ దారిగుండా ప్రయాణించే వాహనదారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఇటీవల అదే దారిలోని కల్వర్టుపై ఓ లారీ కురుకుపోయి దారికి అడ్డంగా ఉండటంతో రెండురోజులపాటు రవాణా నిలిచిపోయిందని వాహనదారులు తెలిపారు. గత నెలలో కురిసిన భారీ వర్షానికి వాగు పొంగడంతో పరిసర ప్రాంతాలు నీటమునిగాయి. వాహనదారులు పక్కగ్రామాల నుంచి తిరిగి వెళ్లే పరిస్థితి దాపురించింది. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నిధులు లేక నిలిచిన పనులు..

ఎల్లమ్మవాగుపై రెండు వంతెనలు, ఇతర కల్వర్టుల నిర్మాణానికి రూ.3 కోట్ల 50 లక్షల నిధులు గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో మంజూరు అయ్యాయి. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టి కల్వర్టులు, ఎల్లమ్మవాగుపై హై లెవల్ వంతెన నిర్మాణ పనులు పూర్తి చేసి పక్కనున్న మరో వంతెన పనులు మొదలు పెట్టి 60 శాతం పూర్తి చేశాడు. వంతెనల నిర్మాణం మొదలుపెట్టిన కాంట్రాక్టర్ పనులు మధ్యలోనే వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సంబంధిత కాంట్రాక్టర్‌ను సాక్షి వివరణ కోరగా.. చేసిన పనులకు బిల్లులు రావడం లేదని, ఇప్పటికే లక్షలాది రూపాయలు అప్పులు తెచ్చామని, తెచ్చిన అప్పులకు వడ్డీ కట్టలేకపోతున్నామని, బిల్లులు రాగానే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన వివరించారు. సంబంధిత శాఖ అధికారులకు ఫోన్‌లో సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు.



కంకర తేలి గుంతలమయంగా బీటీ రోడ్డు

వంతెన నిర్మాణం పూర్తిచేయాలి

వేలేరు నుంచి కొత్తకొండకు వెళ్లే దారిలో ఎల్లమ్మ వాగుపై వంతెన నిర్మాణం పూర్తి కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వంతెన పక్కన తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. గుంతల రోడ్డుపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి త్వరగా పూర్తిచేయాలి.

– కూరపాటి రాజయ్య, వాహనదారుడు

చేనేత సొసైటీ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గండ్ర

- దసరాకు మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల జీఓ జారీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : నియోజకవర్గంలోనే పెద్దదైన శాయంపేట చేనేత సొసైటీ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని చేనేత సొసైటీలో శనివారం సొసైటీ 64వ వార్షిక సాధారణ మహాసభను చైర్మన్ మామిడి శంకర్‌లింగం అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సత్యనారాయణరావు హాజరై మాట్లాడారు. ఐదేళ్లకోసారి ఎన్నికలు జరగాలని, ఎన్నికల విషయమై సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లి సొసైటీని మరింత బలోపేతం చేస్తానని అన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి మహాసభ ఏర్పాటు చేసుకొని నిధులు సక్రమంగా వినియోగించేలా చూడాలన్నారు. పాలకవర్గం సంఘ సభ్యులకు జవాబుదారిగా ఉండాలన్నారు. కార్మికులకు కూలి పెంచేలా ప్రభుత్వం ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు. సొసైటీలో పెండింగ్ బకాయిలను ఇప్పించానని ఆయన గుర్తుచేశారు. సొసైటీ రుణాలను కూడా మాఫీ చేయించేందుకు సీఎంతో మాట్లాడుతానని అన్నారు. చేనేత, జౌళీ శాఖ కమిషనర్, మంత్రి, ముఖ్యమంత్రితో మాట్లాడి సొసైటీ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. రోడ్లు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన నిరాశ్రయులకు దసరా పండుగకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే విధంగా జీఓ జారీ చేస్తామన్నారు. మండలంలో సైడ్ కాల్వ నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేస్తానన్నారు. మాజీ ఎంపీపీ చంద్రప్రకాశ్, మాజీ సర్పంచ్‌లు రవి, శాంత, చేనేత సొసైటీ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, ఆనందం, సమ్మయ్య, ప్రభాకర్, పద్మ, సమ్మక్క, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, నాయకులు లక్ష్మీనారాయణ, రవీందర్, కార్మికులు పాల్గొన్నారు.

పాలకవర్గంపై విమర్శల వెల్లువ

చేనేత సొసైటీ మహాసభలో పాలకవర్గంపై సభ్యులు విమర్శలు గుప్పించారు. పాలకవర్గం నియంతలా వ్యవహరిస్తుందని, మహాసభకు చేనేత, జౌళి శాఖ అధికారులు లేకుండానే సభ నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దీంతో ఎమ్మెల్యే జోక్యం చేసుకుని సర్ది చెప్పారు.

హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలి

కమలాపూర్ : మహిళా ఉపాధ్యాయులు, ఉద్యోగులను వేధింపులకు గురిచేస్తున్న మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీస రాజమల్లయ్యను వెంటనే సస్పెండ్ చేయాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏరుకొండ నరసింహస్వామి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు భిక్షపతి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఉత్తర్వుల ప్రకారం జూనియర్ అసిస్టెంట్ ఉన్న చోట వారితో మాత్రమే వేసవి సెలవుల్లో పని చేయించుకుని సంపాదిత సెలవులు ఇవ్వాల్సి ఉండగా హెచ్‌ఎం రాజమల్లయ్య అందుకు విరుద్ధంగా జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న శారదతో కాకుండా మరో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడితో పనులు చేయిస్తూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించారు. పనులు కావాలంటే ఇంటికి రావాలని ద్వంద్వార్థాలు వచ్చేలా మాట్లాడుతున్న అతడిపై ఉమెన్ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఇలాంటి పనులు చేయడం యావత్ సమాజానికి మంచిదికాదన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆర్జేడీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ మహమ్మారిని తరిమికొట్టాలి



శాయంపేట : మల్టీపర్పస్ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సాయికృష్ణ



వేలేరు : స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



దామెర : రంగోళి పోటీల్లో పాల్గొన్న మహిళలు, అధికారులు

శాయంపేట : ప్రకృతిని కాపాడేందుకు ప్లాస్టిక్ మహమ్మారిని తరమేయాలని తహసీల్దార్ కల్వల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మండలంలోని మైలారం గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో శనివారం స్వచ్ఛతహీసేవ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేదంపై మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం తగ్గించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ప్రకృతికి విఘాతం కలిగించే ప్లాస్టిక్ వస్తువులను వాడొద్దని, వాటికి బదులుగా బట్టసంచులు ఉపయోగించాలని సూచించారు. అనంతరం ప్రథమ బహుమతి జ్యోతి, ద్వితీయ బహుమతి రోజారాణి ఎంపికవగా అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం మహిళలు బతుకమ్మ ఆటలు ఆడారు. అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, డ్వాక్రా మహిళలు రంగులతో ముగ్గులు వేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ఐ రమేశ్, పంచాయతీ కార్యదర్శి రాజేందర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మల్టీపర్పస్ సిబ్బందికి వైద్యపరీక్షలు

శాయంపేట : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న 18 మంది మల్టీపర్పస్ సిబ్బందికి శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్ తెలిపారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా సిబ్బందికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సాయికృష్ణ మల్టీపర్పస్ సిబ్బందికి వైద్యపరీక్షలు నిర్వహించి రక్తనమూనాలు సేకరించినట్లు తెలిపారు.

వేలేరులో..

వేలేరు : స్వచ్ఛతహీ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీఆర్డీఓ నాగపద్మజ అన్నారు. శనివారం మండలంలోని కేజీబీవీ పాఠశాలలో స్వచ్ఛతహీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే అనర్థాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాపాడాలని కోరారు. అనంతరం విద్యార్థులు మొక్కలు నాటి, స్వచ్ఛతహీ సేవపై ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ మాధవి, పాఠశాల ఎస్ఓ స్రవంతి పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో శనివారం స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా రంగోళీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు బహుమతులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ శారద, ఏపీఎం ఝాన్సీ, ఈజీఎస్ ఐకేపీ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవాలి

పరకాల జూనియర్ సివిల్ జడ్జి శాలిని లింగం

పరకాల: ప్రజలు క్షణికావేశంలో చేసిన నేరాలతో నమోదైన కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని పరకాల జూనియర్ సివిల్ జడ్జి శాలిని లింగం సూచించారు. శనివారం స్థానికంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో జడ్జి శాలిని లింగం, రెండో తరగతి జడ్జి కొప్పుల శంకర్ విచారణ చేపట్టి 171 కేసులను పరిష్కరించారు. అలాగే జరిమానాల కింద రూ.4,26,293 విధించారు. లోక్ అదాలత్ సభ్యులు పరకాల, ఆత్మకూరు, శాయంపేట, నడికూడ, దామెర మండలాకు చెందిన ఎస్సైలు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

గులాబీరంగు పురుగును నివారించాలి



పత్తి రైతులకు సూచనలు చేస్తున్న అధికారులు

వేలేరు : పత్తిపంటను నాశనం చేసే గులాబీరంగు పురుగు నివారణకు రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించి నివారించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో రైతుల వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో రసం పీల్చే పురుగు, పత్తిపంటలో కాయతొలుచు పురుగు, గులాబీరంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన నివారణ చర్యలుపై అవగాహన కల్పించారు.

విగ్రహ ఏర్పాటు పనులకు ఆటంకం



పరకాల : మహాత్మాగాంధీ విగ్రహ ఏర్పాటు కోసం ప్రత్యేక జంక్షన్ ఏర్పాటు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక కూరగాయల మార్కెట్ దారి పక్కన గద్దెపై గాంధీ విగ్రహ ఏర్పాటుకు జరుగుతున్న పనులను బీజేపీ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, 9వ వార్డు కౌన్సిలర్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. కూరగాయాల మార్కెట్ కూడలిని గాంధీ జంక్షన్‌గా మార్చాలని కానీ మహాత్మాగాంధీ విగ్రహం ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవాలనే పాలకుల ఆలోచన సరికాదన్నారు.

బృహత్ పీపీవీలో బయోఫెన్సింగ్ మొక్కలు నాటాలి

- అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

శాయంపేట : బృహత్ పల్లెప్రకృతి వనాల్లో బయోఫెన్సింగ్ కోసం కరోండా ముళ్ల మొక్కలను నాటాలని అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్‌రావు ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. తహరాపూర్, గోవిందాపూర్, పెద్దకోడెపాక గ్రామాల్లోని పల్లెప్రకృతి వనాలను, గ్రామ నర్సరీలను, కమ్యూనిటీ ప్లాంటేషన్, బృహత్ పల్లెప్రకృతి వనాన్ని సందర్శించి పరిశీలించారు. పల్లెప్రకృతివనం చుట్టూ బయోఫెన్సింగ్ కోసం కరోండా మొక్కలు నాటినట్లయితే వాటి నుంచి వచ్చే పండ్లకు డిమాండ్ ఉంటుందన్నారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు.

పార్టీకోసం పనిచేసే వారికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ కడియం కావ్య, తదితరులు

పరకాల : గ్రామస్థాయిలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు పార్టీ మొదటి ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా, క్రమశిక్షణ లేకుండా వ్యవహరించే వారి పట్ల కఠిన చర్యలకు వెనుకాడబోదని తెలిపారు. పట్టణంలోని లలిత కన్వెన్షన్ హాల్‌లో శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వరంగల్ ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నిల్లో కాంగ్రెస్ పార్టీ గ్రామగ్రామాన జెండా ఎగురవేసేలా కార్యకర్తలు, నాయకులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, జెడ్పీచైర్మన్ పదవులు సైతం కైవసం చేసుకోవాలని, అందుకు తాను కష్టపడి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఎన్నికల ముందు వచ్చిన వారికి రెండో ప్రాధాన్యత, ఎన్నికల తర్వాత వచ్చిన వారికి మూడో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం వరంగల్ ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రేవంత్‌రెడ్డి సర్కార్ ఇచ్చిన హామీలను విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. మాజీ ఎమ్మెల్యే భిక్షపతి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాసాచారి, మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత, పరకాల, నడికూడ మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదిముబారక్ 40 మంది లబ్ధిదారులకు రూ.40లక్షల 4వేల 640ల విలువ చేసే చెక్కులు పంపిణీ చేశారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి పేదలకు అండగా నిలిచినట్లు చెప్పారు. ఆర్డీఓ నారాయణ, తహసీల్దార్ భాస్కర్, మాజీ ఎంపీపీ స్వర్ణలత, మాజీ జెడ్పీటీసీ సుమలత, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, మార్కెట్ చైర్మన్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



దామెర : విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ రాజేష్‌కుమార్

దామెర : విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ లకావత్ రాజేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో రెండురోజులపాటు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ఐ మండలస్థాయి క్రీడా పోటీల ముగింపు సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు రోజులపాటు అండర్ 17, 14 విభాగాల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపిక చేయడం జరిగిందన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి మండలానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. గేమ్స్ మండల కన్వీనర్ దేవేందర్, రాజేశ్వర్, లక్ష్మీనారాయణ, రమేశ్, రాజ్‌కుమార్, మల్లేష్, నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండలంలోని చర్లపల్లి పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అండర్ 14, అండర్ 17 బాల, బాలికలకు ఖోఖో, వాలీబాల్, కబడ్డీ ఆటల పోటీలు నిర్వహించారు. ఎంఈఓ హనుమంతు, మాజీసర్పంచ్ తిరుపతిరెడ్డి, పీఈటీలు శివకుమార్, రాంబాబు, ప్రేమానందం పాల్గొన్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఐనవోలు : మండల కేంద్రంలోని ఎంఆర్సీ భవనంలో మండలస్థాయి కళాఉత్సవ్ 2024 పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పులి ఆనందం హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వంలోని మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆదేశానుసారం భారతీయ సంస్కృతి సంప్రదాయంలో ఉండే వివిధ కళలలో ప్రావీణ్యం కలిగిన విద్యార్థిని, విద్యార్థులను ఎంపిక చేసి నగదు బహుమతి, ప్రశంసా పత్రాలతో అభినందిస్తూ ప్రతి సంవత్సరం కళాఉత్సవ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓకల్ మ్యూజిక్ సింగింగ్ విభాగంలో హర్షిణి, ఏకశిలా ఈ– టెక్నో స్కూల్, థియేటర్ (మైమ్) విభాగంలో ఎండీ.రెహమాన్ అండ్ టీం, జెడ్పీహెచ్ఎస్ సింగారం, డాన్స్ విభాగంలో మనోజ్ఞ ఏకశిలా ఈ టెక్నో స్కూల్, విజువల్ ఆర్ట్స్(2డీ) విభాగంలో ఎస్.మేఘన, జెడ్పీహెచ్ఎస్ కొండపర్తి, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ (బుర్ర కథ) గ్రూప్ విభాగంలో యశ్వంత్, ఫాత్ ఫౌండర్ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలువగా వారికి బహుమతులు అందజేశారు. వీరికి అక్టోబర్ నెలలో జిల్లా కేంద్రంలో నిర్వహించే కళాఉత్సవ్ పోటీల్లో పాల్గొనే అర్హత ఉంటుందని తెలిపారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విజయ్‌భాస్కర్, స్వప్న వ్యవహరించారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, కేజీబీవీ ఎస్ఓ సత్యవాణి, సీఆర్‌పీలు రేవతి, రాజ్‌కుమార్, గైడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేలేరు : కళాఉత్సవ్‌లో భాగంగా మండలస్థాయి చిత్రలేఖనం పోటీలు ఎంఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగాయి. పీచర జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని భవాని ఉత్తమ ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి జిల్లాస్థాయిలో అర్హత సాధించినట్లు ఎంఈఓ తెలిపారు. హెచ్‌ఎంలు రాజన్న, శ్రీదేవి, డ్రాయింగ్ మాస్టర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సహాయకులకు ముగిసిన శిక్షణ

కమలాపూర్ : నాగులు రోజుల శిక్షణ పూర్తిచేసుకున్న గ్రామ మంచినీటి సహాయకులు గ్రామాల్లో నీటి సరఫరాలో తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు సమర్థవంతంగా పనిచేయాలని మిషన్ భగీరథ ఇంట్రా డీఈఈ అనిల్ సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం మిషన్ భగీరథ ఆధ్వర్యంలో నల్ జల్ మిత్రలో భాగంగా గ్రామ మంచినీటి సహాయకులకు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. నాలుగో రోజు శిక్షణలో కెమిస్ట్ కె.ప్రదీప్‌కుమార్ గ్రామ మంచినీటి సహాయకులకు నీటి నాణ్యత, ప్రాముఖ్యత, పరిరక్షణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించి ప్రత్యక్ష శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఈ అనిల్ మాట్లాడుతూ.. నాలుగు రోజుల శిక్షణలో వివిధ గ్రామ పంచాయతీల నుంచి 33 మంది గ్రామ మంచినీటి సహాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. వారందరికీ శిక్షణ ఇచ్చి పరీక్ష నిర్వహించామని, అందులో వారంతా మంచి ప్రతిభ కనబర్చారని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న గ్రామ మంచినీటి సహాయకులకు ధ్రువీకరణ పత్రాలు అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పరంగా నిర్వహిస్తున్న ఇలాంటి శిక్షణ కార్యక్రమాలను యువత వినియోగించుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ ఇంట్రా ఏఈలు సుభాష్‌రెడ్డి, సతీష్, గ్రిడ్ ఏఈ కిరణ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఎన్పీడీసీఎల్ మండల విద్యుత్ అధికారి లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల విద్యుత్ ఉండని తెలిపారు.